క్లుప్తంగా

ఘనంగా సీతారామస్వామి శాంతి కల్యాణోత్సవం



గుండుగొలనులో స్వామి, అమ్మవార్లకు తలంబ్రాలు పోస్తున్న అర్చకులు

భీమడోలు: గుండుగొలనులో వేంచేసియున్న సీతారామస్వామి ఆలయంలో బుధవారం శాంతి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండ గంగరాజ్ కుమార్ పర్యవేక్షణలో యాజ్ఞిక స్వామి దివిగో పాలార్చక స్వామి, ఆలయ అర్చక స్వామి సుదర్శనం సాయి సుధీరాచార్యులు వార్ల ఆధ్వర్యంలో ఆలయంలో శాంతి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. ఆలయంలోని ధృవ మూర్తులకు అభిషేకాలు, ఉత్సవ మూర్తులకు శాంతి కల్యాణం కనుల పండుగలా జరిగింది. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

కూలీలకు మజ్జిగ పంపిణీ



ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది

పెదపాడు: మండలంలోని సకల కొత్తపల్లి గ్రామంలో ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో ఉపాధి పనులు సకల కొత్తపల్లి గ్రామంలో ముమ్మురంగా సాగుతున్నాయి. వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకుని ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మణ కూలీలకు మజ్జిగను అందించారు. వేసవి కాలం ఎండ తీవ్రంగా ఉండటంతో మజ్జిగ పంపిణీ చేయడంతో కూలీలు హర్షం వ్యక్తం చేశారు. స్థానికులు పీ శ్రీనివాసరావు(పీఎస్ఆర్) అధిక సంఖ్యలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ యాప్‌ను రద్దుచేయాలి



ఎన్ఎంఎంఎస్ యాప్ రద్దుచేయాలని ఆందోళన చేస్తున్న ఉపాధి కార్మికులు

గణపవరం: ఉపాధి హామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ఎన్ఎంఎంఎస్ యాప్‌ను తక్షణం రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ అన్నారు. బుధవారం గణపవరం మండలం అప్పన్నపేట గ్రామంలో ఉపాధి కూలీలతో కలసి ఎన్ఎంఎంఎస్ యాప్‌కు వ్యతిరేకంగా ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల సీఐటీయు కార్యదర్శి ఎం.పెంటారావు, ఉపాధిహామీ పథకం కన్వీనర్ జె.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్పీని కలిసిన వైసీపీ నేతలు



ఏలూరులో ఏఎస్పీ ఎంజేవీ భాస్కరరావును కలిసిన వైసీపీ నేతలు

భీమడోలు: ఏలూరు జిల్లా ఏఎస్పీ(అడ్మిన్)గా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎంజేవీ భాస్కరరావును బుధవారం ఏలూరులోని ఆయన కార్యాలయంలో భీమడోలు మండల వైసీపీ నేతలు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందించారు. ఈయనతో పాటు భీమడోలు మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్య శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, ఉంగుటూరు నియోజకవర్గ జగన్‌సేవాదళ్ కన్వీనర్ తుమ్మగుంట రంగ, జిల్లా చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు డాక్టర్ పాము మాన్‌సింగ్, మండల వైసీపీ ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావులు కలిశారు.

నేడు గాలాయగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం

దెందులూరు: గాలాయగూడెం పంచాయతీలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని తెలిపారు. గ్రామ సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, సొసైటీ చైర్మన్ తోట అచ్చియ్య, ఎంపీటీసీ సొంగా ప్రమీలారాణి, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అంబటి లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొంటారన్నారు. అన్ని శాఖల ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు విధిగా హాజరు కావాలని కోరారు.

అన్నివర్గాల అభ్యున్నతే లక్ష్యం

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- అక్కిరెడ్డిగూడెంలో గడప గడపకు మన ప్రభుత్వం



అక్కిరెడ్డిగూడెంలో ఉప్పలూరి మరియమ్మ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: రాష్ట్రంలో అన్నీ వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని దెందులూరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. బుధవారం వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, గ్రామ సర్పంచ్ చిలకా వెంకటసుబ్బారావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అంబటి లక్ష్మణరావు, సొసైటీ చైర్మన్ తోట అచ్చియ్య, ఎంపీటీసీ సొంగా ప్రమీలారాణి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి గడపకూ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకొని, గత నాలుగేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని మరెన్నో కార్యక్రమాలను నూతన పథకాలను అమలు చేస్తూ పేద, బడుగు, బలహీన, గిరిజన, మైనార్టీ వర్గాలకు అపద్బాంధువుడుగా అభివృద్ధి, సంక్షేమం అమలు చేస్తూ సీఎం జగన్ చరిత్ర సృష్టించారన్నారు. ప్రతి కుటుంబంలో నాలుగేళ్లల్లో జరిగిన అభివృద్ధి, సంక్షేమం, మీకు మంచి జరిగితేనే మా ప్రభుత్వానికి ఓటు వేయండని మేము ధైర్యంగా ప్రతి కుటుంబానికి చెబుతున్నామంటే మా ప్రభుత్వ పనితీరు ఎంత పారదర్శకంగా పేదల పక్షాన ఉందో గమనించాలన్నారు. నాలుగేళ్లు చేసిన అభివృద్ధి, సంక్షేమంతో పాటు ఇంకా ప్రతి ఇంట్లో, ప్రతి గ్రామంలో మిగిలి ఉన్న సమస్యలు పరిష్కరించాలన్న దూరదృష్టితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అమలు చేస్తున్నారన్నారు. స్పందన, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పన్న ప్రసాద్, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు గంటా ప్రసాదరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, జడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, మండల వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు కొలుసు గణపతిరావు, నల్లూరి వెంకట్రామయ్య (బాబి), సంపంగి వేణుగోపాల్ తిలక్, సప్పా మురళి, శనపల్లి రామకృష్ణ (విష్ణు), కోటే నాగమల్లేశ్వరి కుమార్, ఏనుగు అంజలి ప్రసాద్, తోట వెంకన్న, వార్డు మెంబర్లు, గృహసారథులు, వలంటీర్లు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన నర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు

పెదపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. బుధవారం కొవ్వూరులో జరిగిన వలంటీర్ల సత్కార కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ముఖ్యమంత్రిని ఘంటా ప్రసాదరావు కలుసుకుని పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఘంటాతోపాటు దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ముఖ్యమంత్రి జగన్‌కు నియోజకవర్గంలోని పరిస్థితులను ఆయనకు వివరించారు. నియోజకవర్గంలోని పరిస్థితులపై ఆరా తీసి నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషిచేస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు ఘంటా ప్రసాదరావు తెలిపారు.

అరటి తోట రైతులను ఆదుకోవాలి



పోలసానిపల్లిలో పడిపోయిన అరటి తోటలను పరిశీలిస్తున్న జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

భీమడోలు: ఈదురుగాలులు వల్ల దెబ్బతిన్న అరటి తోటల రైతులకు నష్టపరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. భీమడోలులోని పోలసానిపల్లిలో బుధవారం ఈదురుగాలులకు పడిపోయి దెబ్బతిన్న అరటి తోటలను ఆయన పరిశీలించారు. రైతుల నుంచి నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈదురుగాలులు, అకాల వర్షం వల్ల అరటి తోటలు పడిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఏకరానికి లక్ష రూపాయల వరకు నష్టపోయారని, ఏకరానికి 800 పైగా అరటి చెట్లు ఉండగా ఈదురుగాలులకు 300కు పైగా అరటి చెట్లు పడిపోయాయన్నారు. గెలలు తయారయ్యే దశలో అరటి చెట్లు పడిపోవడంతో రైతులకు తీరని నష్టం వాటిల్లిందన్నారు. జరిగిన నష్టాన్ని ఉద్యానవన అధికారులు నమోదు చేసుకోవాలని, వారికి నష్టపరిహారాన్ని అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంటల బీమా పరిహారం కూడా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, నాయకులు గుర్రం రాంబాబు, పలువురు అరటి రైతులు పాల్గొన్నారు.

గంగాధరరావు మృతి పార్టీకి తీరని లోటు



కొవ్వలిలో గంగాధర్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: వైఎస్సార్‌సీపీ నేత, రిటైర్డ్ అసిస్టెంట్ ఇంజనీర్ గంగాధరరావు ఆకస్మిక మరణం పార్టీకి, వ్యక్తిగతంగా తనకు ఎంతో లోటని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు అన్నారు. బుధవారం ఉదయం కొవ్వలిలో గంగాధరరావు భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గంగాధరరావు సతీమణి కొవ్వలి వైఎస్సార్‌సీపీ గ్రామ సర్పంచ్ ఇంటేటి మధులత, కుమారులను, తల్లిదండ్రులను ఎమ్మెల్యే, రామచంద్రరావులు పరామర్శించారు. కుటుంబానికి పార్టీపరంగా అండగా ఉంటామని అన్నారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి జానంపేటబాబు, జడ్పీ వైస్ చైర్మన్ పీ. విజయ్‌బాబు, దెందులూరు ఎఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, గ్రామ మాజీ సర్పంచ్ బూసి రత్నాంజలి ఎఫ్రైల్, గారపాటి సీతారామాంజనేయ చౌదరి, వడ్లపట్ల శ్రీనివాసరావు, గొల్ల వీరాస్వామి, గొల్ల కిరణ్ తదితరులు ఉన్నారు.

పార్లమెంట్ భవనానికి అంబేడ్కర్ పేరుపెట్టాలి



పిప్పరలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాలమహానాడు అధ్యక్షుడు మంగరాజు

గణపవరం: భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ పేరును ఢిల్లీలో నూతనంగా నిర్మించిన భారత పార్లమెంట్ భవనానికి పెట్టాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు డిమాండ్ చేశారు. బుధవారం గణపవరం మండలం పిప్పరలో నిర్వహించిన మండల మాల మహానాడు సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు అన్నివర్గాల ప్రజలకు రక్షణ కల్పించిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అని, ఆయన పేరు భారత పార్లమెంట్ భవనానికి పెట్టి ఆయనకు తగిన గౌరవం ఇవ్వాలని కోరారు. దళితులను ఎస్సీ జాబితాలో చేర్చడానికి ఏపీ అసెంబ్లీలో పంపిన తీర్మానాన్ని కేంద్రం వెంటనే ఆమోదించి, దళితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజు, వెంకటేశ్వరరావు, చంటి, మోహన్, సాల్మన్, కృపారావు, మహేష్, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాల్లో సీసీ డ్రెయినేజీ, రోడ్ల నిర్మాణం



గణపవరంలో సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ అలంకారం

గణపవరం: పట్టణంలో అన్ని ప్రాంతాల్లో సీసీరోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టనున్నట్లు గణపవరం సర్పంచ్ మూర అలంకారం తెలిపారు. బుధవారం గణపవరం పంచాయతీ పరిధిలోని సువర్ణగుండం వాటర్‌ట్యాంకు ఏరియాలో నూతనంగా నిర్మించనున్న సిసి మురుగు డ్రెన్‌ల నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఇప్పటికే పట్టణంలో అన్ని రోడ్లు సీసీరోడ్లుగా నిర్మించామని, అవసరమైన చోట్ల సీసీ రోడ్లు, డ్రెయిన్‌ల నిర్మాణం చేపట్టడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. రాష్ట్ర సూర్యబలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, మండలవైఎస్సార్‌సీపీ కన్వీనర్ దండు రాము, పంచాయతీ కార్యదర్శి డి.శివ రామ్‌ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు రొంగల శ్రీను, సరిపల్లె చిన్నా, శెట్టి రాజా, వడ్డి ఉమ, మూర భాస్కరరావు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



గణపవరంలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా నిలిచి, ప్రభుత్వ పథకాలను, కార్యక్రమాలను పారదర్శకంగా నేరుగా ప్రజలకు చేరవేస్తున్న వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. బుధవారం సాయంత్రం గణపవరంలో కేవీపీ పంక్షన్‌హాల్‌లో మండలంలోని వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వాసుబాబు మాట్లాడుతూ దేశంలో మరే రాష్ట్రంలోనూ లేనివిధంగా ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంతి వైఎస్‌జగన్ ఏర్పాటు చేసిన వలంటీర్ల వ్యవస్థ ప్రజలకు సత్వర సేవలందించడంలో అందరికన్నా ముందుంటూ ఆదర్శంగా నిలిచిందన్నారు. కరోనా కాలంలో వలంటీర్లు అందించిన సేవలు నభూతో నభవిష్యత్ అన్నారు. వలంటీర్ల సహకారంతోనే ప్రభుత్వం కరోనా ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొగలిగిందన్నారు. పరిపాలనను ప్రజల చెంతకు చేర్చడానికి ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేశారని, ముఖ్యమంత్రి ఆశయ సాధనకు మీరంతా చిత్తశుద్ధితో పనిచేయాలని వాసుబాబు కోరారు. కుల,మత, పార్టీ, వర్గ ప్రాంతీయ బేధాలు లేకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలను అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సూర్య బలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసి సభ్యురాలు దేవారపు సోమలక్ష్మిబాబులు, మండల ఉపాధ్యక్షురాలు సలాది దుర్గా రత్నకుమారి, సర్పంచ్‌లు మూర అలంకారం, చనుమూరి లక్ష్మికుమారి, కురెళ్ల వెంకటరత్నం, పాతంశెట్టి శ్రీను, నక్కా సూరి బంగారయ్య, మద్దాల మధు, దుళ్ల కుటుంబరావు, మల్లంపల్లి సురేష్, పార్టీనాయకులు రొంగలశ్రీను, ఎంపిటిసి సభ్యులు బత్తి సీతామహాలక్ష్మి, వేగేశ్న విజయదుర్గానందిని తదితరులు పాల్గొన్నారు.

యోగా ద్వారా మానసిక ప్రశాంతత

భీమడోలు: యోగాతో మానసిక ప్రశాంతత, ఏకాగ్రతలతో పాటు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని భీమడోలు ఎంపీపీ కనమాల రామయ్య అన్నారు. భీమడోలు ఎంపీపీ సమావేశ మందిరంలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం, అంతర్జాతీయ యోగా దినోత్సవాలను పురస్కరించుకుని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఒక రోజు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కనమాల రామయ్య మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ ఒత్తిడితో పని చేస్తున్నారని, తద్వారా అనేక శారీరక, మానసిక రుగ్మతలను ఎదుర్కొంటూ తీవ్ర అనారోగ్యం పాలైవుతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతి రోజు అరగంట సమయాన్ని కేటాయించుకుని తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. ప్రజాప్రతినిధులు, ఎంపీడీవో సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉంగుటూరులో వలంటీర్లకు వందనం

ఉంగుటూరు: వలంటీర్లకు వందనం కార్యక్రమం నేడు ఉంగుటూరులో ఉదయం 8 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ గంట శ్రీలక్ష్మి తెలిపారు.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వాసుబాబు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని ఆమె తెలిపారు. 420 మంది వలంటీర్లను సత్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికార్లు పాల్గొని జయప్రదం చేయాలని ఆమె కోరారు.

రాట్నాలమ్మ హుండి లెక్కింపు

పెదవేగి : రాట్నాలమ్మ అమ్మవారి దేవస్థానం తాలూకా హుండీని బుధవారం లెక్కించారు. పెదవేగి మండలం రాట్నాలకుంటలో వేంచేసిన రాట్నాలమ్మ అమ్మవారి హుండీని 62 రోజులకుగాను వచ్చిన సొమ్ము రూ. 11,59,150 ఆదాయం లభించిందని దేవస్థాన చైర్మన్ చళ్ళగొళ్ల వెంకటేశ్వరరావు చెప్పారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, ధర్మకర్తలు గరికిముక్కు సర్వేశ్వరరావు, పాకలపాటి వెంకటేశ్వరరావు, మేరుగు వెంకటేశ్వరరావు, నంబూరి జనార్దనరావు, నాగార్జున లక్ష్మీరాధిక, ఈడా ధర్మారావు, కట్టా నాగరాజు, లింగాల కనకారావు, రాట్నాలకుంట ప్రెసిడెంట్ జెట్టి వెంకటేశ్వరమ్మ, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, రాయన్నపాలెం సర్పంచ్ పర్వతనేని రమాదేవి, కొండలరావు ప్రెసిడెంట్ పాలడుగు సత్యవతి, ఎంపీటీసీలు దేవళ్ళరాజు రాధిక, మట్టా రాగిణి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురు మందుబాబులకు జరిమానా

భీమడోలు: మద్యం సేవించి వాహనాలను నడుపుతున్న ముగ్గురి వ్యక్తులను మంగళవారం రాత్రి భీమడోలు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గుంటూరు చెందిన ఇద్దరు, రాజమహేంద్రవరంకు చెందిన వ్యక్తి మద్యం సేవించి లారీ, ఆటోలను నడుపుతుండగా వారిని పట్టుకున్నారు. వారిని భీమడోలు కోర్టులో బుధవారం హాజరుపర్చగా ఒకొక్కరికి రూ.10వేల చొప్పున ముగ్గురికి రూ.30వేలను న్యాయమూర్తి జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

అక్రమ గ్యాస్ సిలెండర్లు పట్టివేత

ఉంగుటూరు: నారాయణపురం అమృత టిఫిన్స్ హోటల్‌లో గృహలకు ఉపయోగించే గ్యాస్ సిలిండర్లు ఉపయోగించడంతో వాటిని పట్టుకున్నట్లు అధికారి శేఖర్‌బాబు తెలిపారు. ఈమేరకు 6 ఎ, 7(1) కేసు నమోదు చేశామని తెలిపారు.







ఉత్సాహంగా వేసవి శిక్షణ తరగతులు



భీమడోలులో దేశభక్తి, శతక పద్యాలను ఆలపిస్తున్న చిన్నారులు



పోతునూరు గ్రంథాలయంలో వేసవి ప్రత్యేక శిక్షణ తరగతుల దృశ్యం

భీమడోలు: దేశభక్తి గల విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. మండలంలోని భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శిక్షణా తరగతులు 17వ రోజైన బుధవారం కొనసాగాయి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని పుస్తక పఠనంపై ఆసక్తిని పెంచుకుంటున్నారు. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పుస్తక పఠనం, నీతి కథలు, దేశభక్తి గేయాలు, శతక పద్య పోటీలను నిర్వహించారు. పూళ్ల గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో చిన్నారులకు బుద్ధ యోగా హెల్త్ ఫౌండేషన్ నిపుణులు కురెళ్ల కిషోర్ చిన్నారులకు యోగాసనాలపై తర్ఫీదు అందించారు. ఏకాగ్రత, క్రమశిక్షణ, మానసిక ప్రశాంతతకు దోహదపడే యోగాసనాలు మనిషి ధృఢంగా ఉంచుతాయని వారు పేర్కొన్నారు. గుండుగొలను గ్రంథపాలకుడు జి.నాగమణి ఆధ్వర్యంలో చిన్నారులకు పలు పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పెద్దలు, పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.



పిప్పర గ్రంథాలయంలో విద్యార్థులకు మెడల్స్ అందజేస్తున్న నేతలు



విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తున్న గ్రంథపాలకుడు రాంబాబు

దెందులూరు: విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచి విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు కృషి చేయాలని పోతునూరు గ్రంథాలయాధికారి డీ.జాన్‌బాబు, దెందులూరు గ్రంథాలయాధికారి రాజ్యలక్ష్మి అన్నారు. బుధవారం రెండు గ్రంథాలయాల్లో మహాత్ముల జీవితచరిత్రను వివరించి అవగాహన కల్పించారు. తల్లిదండ్రుల సైతం చిన్నారుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషి తమ వంతు సహాయసహకారాలు అందించాలన్నారు. శాఖా గ్రంథాలయంలో కొనసాగుతున్న వేసవి శిక్షణతరగతులు

పెదపాడు: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు 17వ రోజుకు చేరుకున్నాయి. బుధవారం గ్రంథాలయంలో నీతికథలు చెప్పడం, విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించామని గ్రంథపాలకుడు జీ రాంబాబు తెలిపారు.

గణపవరం: వేసవి విజ్ఞాన తరగతుల్లో బైరాజు ఫౌండేషన్ ఉచితంగా అందిస్తున్న కంప్యూటర్ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌టిఎఫ్ నాయకుడు కాకర శ్యాంసన్ అన్నారు. బుధవారం గణపవరం మండలం పిప్పర శాఖా గ్రంథాలయంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా శ్యాంసన్‌మాట్లాడుతూ ప్రస్తుత కాలనికి అనుగుణంగా విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే కంప్యూటర్ పరిజ్ఞానం అవసరమన్నారు. గ్రంథపాలకుడు రంగారావు మాట్లాడుతూ వేసవి విజ్ఞాన తరగతుల్లో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన అంశాల్లో శిక్షణ ఇచ్చామన్నారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఐఎస్ఎన్‌రాజు, దుర్గాప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.